క్లుప్తంగా

మురుగు శుద్ధి కర్మాగారానికి స్థల కేటాయింపు



ధ్రువీకరణ పత్రాలను ఎంపీడీఓకు అందిస్తున్న తహసీల్దార్

జె.పంగులూరు: మండల పరిధిలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో మల, మురుగు శుద్ధి కార్మాగారం నిర్మాణానికి తహసీల్దార్ సింగారావు సర్వేనెంబర్ 299లోని ప్రభుత్వ స్థలంలో ఒక ఎకరా కేటాయించారు. దీనికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని ఎంపీడీఓ కె. స్వరూపారాణికి శుక్రవారం అందించారు.

సూర్యఘర్ లక్ష్యాలు పూర్తి చేయండి

బల్లికురవ: ప్రధాన మంత్రి సూర్యఘర్‌తో విద్యుత్ బిల్లు ఆదాతోపాటు మిగిలి ఉన్న విద్యుత్‌ను సంస్థకు అమ్ముకుని ఆదాయం పొందవచ్చని ఎంపీడీఓ కుసుమకుమారి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం వీవో ఏలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 78 వేల వరకు యూనిట్ ఏర్పాటుకు సబ్సిడీ అందజేస్తున్నారని తెలిపారు. వెలుగు ఏపీఎం రాజారావు, పలు బ్యాంకుల మేనేజర్లు మేనేజర్ ప్రవీణ్‌రాజు, ప్రత్యూష, యం. వాసు, రవీంద్రబాబు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి, స్త్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు



గ్రామాల్లో పిల్లల కోసం పర్యటిస్తున్న ఉపాధ్యాయులు

పర్చూరు(చినగంజాం): అడుసుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు.. విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ప్రధానోపాధ్యాయురాలు నిర్మలా కుమారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమీప ప్రాంతాలైన అడుసుమల్లి, బోడవాడ, గొల్లపూడి, ఇనగల్లు, చిననందిపాడులో బడిఈడు పిల్లల గృహాలకు వెళ్ళి వారిని బడిలో చేరాల్సిందిగా కోరారు. కాన్‌సెప్ట్ విధానం ద్వారా వ్యక్తిగత పర్యవేక్షణలో విద్యాబోధన ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఉపాధ్యాయులు శ్రీరాం శ్రీనివాసరావు, రవి, రాఘవరెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధులు మెరుగు పరచుకోండి

ఇంకొల్లు(చినగంజాం): మహిళా సంఘాలు జీవనోపాధులు మెరుగు పరచుకోవాలని ఎంపీడీఓ జి. శ్రీనివాసరావు అన్నారు. కార్యాలయంలో శుక్రవారం సమాఖ్య సమావేశం నిర్వహించారు. స్త్రీనిధి మేనేజర్ జే కామేశ్వరి, ఏపీఎం అనురాధ పాల్గొన్నారు.

పేదల చదువుపై కక్ష!

- యద్దనపూడి బాలయోగి గురుకుల పాఠశాలలో నిలిచిన పుస్తకాల పంపిణీ
- గత నెల 10 న పాఠశాలకు చేరిన పుస్తకాలు
- బయట కొనుగోలు చేస్తున్న బాలికలు
- సిబ్బంది, ప్రిన్సిపాల్ నిర్లక్ష్య వైఖరిపై తల్లిదండ్రుల ఆగ్రహం



యద్దనపూడి బాలయోగి గురుకుల పాఠశాల

యద్దనపూడి: విద్యా సంవత్సరం మొదలై నెల దాటినా ఇంతవరకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయకుండా విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడుకుంటున్నారు. మండల కేంద్రంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5 నుంచి పదో తరగతి వరకు 547 మంది బాలికలుంటారు. పేద కుటుంబాలకు చెందిన వారు, అనాథ పిల్లలు, సింగిల్ పేరెంట్‌గా ఉండే వారే చేరుతుంటారు. అయితే వీరందరికీ నాణ్యమైన విద్య అందడం కలగా మారింది. ఒకపక్క ప్రభుత్వం పాఠశాలలు తెరవక ముందే విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశామని ప్రకటనలు గుప్పిస్తున్నా వాస్తవ పరిస్థితులు భిన్నంగా నెలకొన్నాయి. జూన్ 10వ తేదీన మండల విద్యావనరుల కేంద్రం నుంచి పాఠ్య పుస్తకాలను గురుకుల పాఠశాలకు తరలించినా పాఠశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్య ధోరణితో ఇప్పటికీ గురుకుల విద్యాలయంలోని బాలికలకు అందించకపోవడం గమనార్హం. పాఠశాల ప్రారంభమై నెల రోజులు కావస్తుండటంతో ప్రిన్సిపాల్‌ను అడిగే ధైర్యం చేయలేని విద్యార్థినులు.. తమను ఒత్తిడి చేసి బయట షాపుల్లో పుస్తకాలు కొనుగోలు చేయిస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇన్ని రోజులు పుస్తకాలు ఇవ్వకుండా ఎలా పాఠ్యంశాలు బోధిస్తున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క పంటలకు గిట్టుబాటు ధర లేక, సరైన పనులు లేక ఆర్థిక ఇబ్బందులతో సతమంతం అవుతున్న పేదలకు ఇది అదనపు ఖర్చుగా మారింది. ప్రిన్సిపాల్, ఇతర సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా పుస్తకాలు సకాలంలోనే వచ్చాయని పనుల ఒత్తిడి వల్ల పంపిణీ చేయలేక పోయామని తెలిపారు. వెంటనే పంపిణీ చేస్తామని తెలిపారు. ఇదే విషయంపై ఎంఈఓ–2 గోపిని వివరణ కోరగా జూన్ 10 వ తేదీనే విద్యార్థుల సంఖ్యను బట్టి పుస్తకాలు పంపించామన్నారు. అయితే బాలికలకు పుస్తకాలు పంపిణీ చేయలేదన్న విషయం తల్లిదండ్రుల ద్వారా ఇప్పుడే తనకు తెలిసిందన్నారు. అలాగే డీఎస్ఓ శ్రీదేవి 'సాక్షి'తో మాట్లాడుతూ ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని వెంటనే పుస్తకాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

డెంగీ జ్వరం ప్రమాదకరం



చినగంజాం పీహెచ్‌సీ పరిధిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

చినగంజాం: డెంగీ వ్యాధి ప్రబలకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సిరివెన్నెల అన్నారు. డెంగీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం శుక్రవారం చినగంజాం సచివాలయంలో నిర్వహించారు. ఇందులో భాగంగా ర్యాలీ నిర్వహించారు. డెంగీ వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి నిల్వలు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమ కాటు నుంచి రక్షణ పద్ధతులు, దోమతెరలు వాడకం, ఫ్రైడే.. డ్రైడే రోజున పరిసరాలు, పరిశుభ్రత, ఇంటి లోపల వెలుపల దోమలు పెరిగే ప్రదేశాలను, కొబ్బరి బోండాలు, పాత కూలర్లు, రోడ్డు గుంతల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వాలు పెరుగుతాయని అవగాహన కల్పించారు. మానసిక వైద్యుడు డాక్టర్ సందీప్ మాట్లాడుతూ మానసిక వ్యాధి గ్రస్తులు టొబాకో, గుట్కా వాడుతున్న వారు మొదటి శుక్రవారం రోజున ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్యం చేయించుకోవాల్సిందిగా సూచించారు. డెంగీ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యశాలకు వచ్చి వైద్యం చేయించుకోకుంటే ప్రమాదాలు ఏర్పడతాయని తెలిపారు. హెల్త్ సూపర్ వైజర్ చిరంజీవి, హెల్త్ అసిస్టెంట్ మురళి, ఎంఎన్ఓ సుబ్బారావు, కావ్య, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వరూపారాణి

జె.పంగులూరు: ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకొని ప్రతి ఒక్కరు ఆర్థికంగా ముందు పోవాలని ఎంపీడీఓ కె. స్వరూపారాణి, ఏపీఎం కోటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఏపీఎం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో వీవోఏలు, గ్రామ సంఘం అధ్యక్షుల సమావేశం జరిగింది. ఎంపీడీఓ కె. స్వరూపరాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. సీసీలు సాల్మన్, సురేష్, చంద్రశేఖర్, వీవోఏలు, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

పట్టణ అధ్యక్షుడిగా గంగయ్య యాదవ్



మార్టూరు: వైఎస్సార్ సీపీ మార్టూరు పట్టణ అధ్యక్షునిగా అడకా గంగయ్య యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేసింది. గంగయ్య యాదవ్ పాటు మరో 28 మందితో మార్టూరు పట్టణ కమిటీని ప్రకటించింది. ఈ సందర్భంగా గంగయ్య యాదవ్ మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన తనపై నమ్మకం ఉంచి మార్టూరు పట్టణ అధ్యక్షునిగా పేరును సిఫారసు చేసిన పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నూతన కమిటీతో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావడం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు గర్నెపూడి రవిచంద్ ఆధ్వర్యంలో అడకా గంగయ్య యాదవ్ తో సహా నూతన కమిటీ సభ్యులను స్థానిక నాయకులు, కార్యకర్తలు సన్మానించారు.

హనిమిరెడ్డిని కలిసిన యువజన విభాగం అధ్యక్షుడు



హనిమిరెడ్డిని సత్కరిస్తున్న మధుబాబు

అద్దంకి రూరల్: అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన బొనిగల మధుబాబు గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్ చార్జి పానెం హనుమిరెడ్డిని కలిశారు. ఆయన్ను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యం



గజ ఈతగాళ్లకు సూచలిస్తున్న రూరల్ ఎస్సై చంద్రశేఖర్

చీరాల టౌన్: పర్యాటక ప్రాంతాలైన వాడరేవు, రామాపురం సముద్ర తీరప్రాంతాలకు వచ్చే పర్యాటకుల భద్రతకు పోలీసుశాఖ పటిష్ట చర్యలు తీసుకుంటుందని రూరల్ సీఐ పి.శేషగిరిరావు తెలిపారు. శుక్రవారం చీరాల మండలంలోని వాడరేవు, రామాపురం, కఠారిపాలెం, పొట్టిసుబ్బయ్య పాలెం, తదితర తీరప్రాంతాల్లో గజ ఈతగాళ్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పర్యాటకులు సముద్రంలో లోతుకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిషిద్ధ ప్రదేశాల్లో పర్యాటకులు సముద్రంలో స్నానాలకు వెళ్లకుండా చూడాలని, పోలీసులు నిర్ధారించిన ప్రదేశాల్లోనే పర్యాటకులు స్నానాలు చేసేలా అవగాహన కల్పించాలన్నారు.

శాకంబరిగా గంగా భవాని



శాకంబరిగా దర్శనమిస్తున్న వైష్ణవీదుర్గామాత

కారంచేడు: విజయవాడ కనకదుర్గమ్మను పోలిన శ్రీ వైష్ణవీదుర్గా మాత ఆలయంలో అమ్మవారిని శుక్రవారం కూరగాయలతో శాకంబరీదేవిగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి ఏటా ఈ ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని భక్తులు చెబుతున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

చీరాల అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గేట్ మీటింగ్ నిర్వహించారు. బాపట్ల జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.వెంకటరావు మాట్లాడారు. అర్హులైన ఉద్యోగులందరికీ పదోన్నతులకు అనుమతులు ఇవ్వాలని కోరారు. విద్యుత్ బస్సులు ఆర్టీసీ ద్వారా నిర్వహించాలని, ఉద్యోగ భద్రత సర్క్యులర్ 1/2019ను యథావిధిగా అమలు చేయాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాల్సిన 11వ పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు పాత పద్ధతిలోనే వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. డిపో కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, అధ్యక్షులు కాల్వ శ్రీనివాసరావు, పి.రవి, గ్యారేజీ కమిటీ, మహిళా నాయకులు వి.సునీత, పి.సుజాత, దాక్షావతి, పుష్పవల్లి, కుసుమకుమారి పాల్గొన్నారు.

గుర్తింపు తెచ్చుకోండి



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానించిన సహ ఉపాధ్యాయులు

వేటపాలెం: ఉపాధ్యాయ వృత్తిలో అంకిత భావంతో పనిచేసి మంచి గుర్తింపు సాగించు కోవాలని ప్రధానోపాధ్యాయురాలు దేవర కొండ రజిని పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల నుంచి బదిలీపై పదోన్నతి పై వెళుతున్న ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం శుక్రవారం నిర్వహించారు. హిమజ, వేదాల ఫణి సత్యనారాయణ, మాధి, అనురాధ, ఉమామహేశ్వరి, ఝాన్సీ, పార్వతి, విజయలక్ష్మి, నాగేశ్వరి, వెంకటరమణ, శారద, వ్యాసశ్రీ, అనురాధ, ప్రమీలారాణి, కోటేశ్వరమ్మ, శివశాస్త్రి, భాగ్యశ్రీ, విజయలక్ష్మిని సత్కరించారు.

రద్దీ రోడ్డుపై విరిగి పడిన ఫ్లెక్స్

పర్చూరు(చినగంజాం): నిత్యం జనసంచారంతో రద్దీగా ఉండే రోడ్డుపై ఫ్లెక్స్ అకాస్మాత్తుగా విరిగి పడింది. శుక్రవారం పర్చూరులో వీచిన పెనుగాలి దుమారానికి స్థానిక బొమ్మల సెంటర్‌లో అటు ఇటూ ఊగుతున్న ఫ్లెక్స్ ఒక్కసారిగా పడి పోయింది. ఆ ఆ సమయంలో జన సంచారం లేక పోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఇలాంటి ఫ్లెక్స్‌లను పంచాయతీ అధికారులు, సిబ్బంది తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



పర్చూరు బొమ్మల సెంటర్‌లో విరిగి పడిన ఫ్లెక్స్

మన్యం వీరుడు అల్లూరి



చినగంజాం: అల్లూరి సీతారామరాజు, పింగళి వెంకయ్య, వివేకానంద చిత్రపటాలకు నివాళులు

మార్టూరు: భరతమాత స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారిని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128 వ జయంతి వేడుకలను శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. రాజు గారి పాలెం గ్రామంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి స్థానిక క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతి రాజు, ఎంపీటీసీ సభ్యుడు కల్లే పల్లి శ్రీనివాసరాజు, క్షత్రియ యువ జన సంఘం సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు. సాయంత్రం మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రాజు గారి పాలెం లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పించారు.

యద్దనపూడి: సీతారామరాజు స్ఫూర్తి ప్రదాతని ఎంపీడీఓ కృష్ణ అన్నారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. 27ఏళ్ల వయస్సులోనే అమరుడయ్యాడన్నారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చినగంజాం: మహనీయుల త్యాగాలను, గొప్పతనాన్ని విద్యార్థులు గుర్తుపెట్టుకొని వారిని ఆదర్శంగా తీసుకొని భవిష్యత్‌ను కొనసాగించాలని కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కుర్రా రామారావు అన్నారు. కడవకుదురులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కుర్రా రామారావు నివాళులర్పించారు. అదే విధంగా పింగళి వెంకయ్య వర్ధంతిని నిర్వహించారు. జాతీయ జెండాను రూపొందించడంలో ఆయన చేసిన కృషిని తెలియజేశారు. ఉపాధ్యాయులు బీవీ ప్రసాద్, బి. భాస్కర్, ఎస్. ప్రసాద్, బి. పద్మకుమార్, ఎన్. సుధావాణి పాల్గొన్నారు.



పర్చూరు: అల్లూరి సీతారాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య, సిబ్బంది

పర్చూరు(చినగంజాం): స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బ్రహ్మయ్య సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీటీ సుధారాణి, ఎలక్షన్ డీటీ మాధవీలత, రీ సర్వే డీటీ అరుణ, వీఆర్వోలు యార్లగడ్డ శ్రీనివాసరావు, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చీరాల: అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎంపీడీఓ కార్యాలయంలో..

ఎంపీడీఓ కార్యాలయంలో చిత్రపటానికి ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్, ఈఓపీఆర్డీ కె. సత్యనారాయణ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీడీఓ కార్యాలయం, వెలుగు, ఉపాధి హామీ సిబ్బంది, సీనియర్ సహాయకులు వాసుదేవరావు, ఏపీఎం రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఏ. మస్తాన్‌రావు, ఎంఈఓ పి. వెంకటరామయ్య పాల్గొన్నారు.

కారంచేడు: మన్యం విప్లవ వీరునిగా పేరుగడించిన అల్లూరి సీతారామరాజుకు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. శుక్రవారం మండల కేంద్రమైన కారంచేడు రెవెన్యూ కార్యాలయంలో చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీడీఓ కె. నేతాజీ, తహసీల్దారు జి. నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



బల్లికురవలో నివాళులర్పిస్తున్న తహసీల్దార్

చీరాల అర్బన్: భారతీయ విద్యార్థి ఫెడరేషన్ చీరాల కమిటీ ఆధ్వర్యంలో యూటీఎఫ్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బి.వెంకటకుమార్, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బండి భిక్షాలు నివాళులర్పించారు. యూటీఎఫ్ నాయకులు గుమ్మా శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ నాయకులు వి.భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు భారతదేశానికి, రాష్ట్రానికి అందించిన సేవలు చిరస్మరణీయమని తహసీల్దార్ రవినాయక్ అన్నారు. అల్లూరి 128వ జయంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీటీ రవికుమార్, ప్రహర్ష రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. బాచిన శివధర పూర్ణచంద్రరావు, అళహరి హరిప్రసాద్, గురుశేఖర్, చప్పిడి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

3 వేల గొర్రెలకు నట్టల నివారణ మందు

మార్టూరు: బొల్లాపల్లి గ్రామంలో శుక్రవారం పశు వైద్యాధికారులు 3000 గొర్రెలకు నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. పశు వైద్య శాఖ ఏడీ డాక్టర్ ఆర్ శ్రీనివాసరావు, కోలలపూడి పశువైద్యురాలు మాధవీ లత, మండల రైతు సంఘం నాయకుడు వీరవల్లి కృష్ణమూర్తి పశు వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హరిబాబు

కుంకలమర్రు (కారంచేడు): నేటి సమాజంలో బాలికలపై జరుగుతున్న ఘోరాలను అరికట్టేలా బాలికలు అప్రమత్తంగా వ్యవహరించాలని శక్తి టీం ఇన్‌చార్జ్, ఎస్ఐ ఎ. హరిబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని కుంకలమర్రు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన బాలబాలికలకు అనేక విషయాలపై అవగాహన కల్పించారు. బాపట్ల ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ మొయిన్ సూచనలతో చీరాల సబ్ డివిజన్ పరిధిలో శక్తిటీం నిరంతరం పనిచేస్తుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బాలబాలికల చేతుల్లో సెల్‌ఫోన్‌లు ఉంటున్నాయని, వాటిని అవసరమైన మేరకు మాత్రమే వినియోగించాలన్నారు. బాలికల ఫేస్‌లను అసభ్యకరమైన ఫొటోలుగా మార్చి వాటిని నెట్‌లో పెట్టే ప్రమాదముందన్నారు. ప్రధానోపాధ్యాయులు బొప్పూడి బాలప్రసాద్, శక్తి టీం సభ్యులు లోకేష్, సుబ్బారావు, సునీత, వరలక్ష్మి, ఉపాధ్యాయులు పిచ్చియ్య, నాగరాజు, శ్రీనివాసులు, రజనీకాంత్, లక్షణరావు, సంధ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా రోశయ్య జయంతి

వేటపాలెం: మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 92వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వ హిచారు. స్థానిక జీడిపప్పు షాపులో పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడారు. రాష్ట్రంతో పాటు, చీరాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారన్నారు. జీడిపప్పు పరిశ్రమ టాక్స్ తగ్గింపు, వస్త్ర పరిశ్రమ పై ట్యాక్స్ తగ్గింపు కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. గౌడవర్తి రామకృష్ణ, బెంజిమెన్, కరణం మురళీకృష్ణ, హరి ప్రసాదరావు, రామారావు, సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, కజవల్లి, సుధాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కొణిజేటి రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణ, మండల ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కొణిజేటి రోశయ్య 92 వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లోని రోశయ్య కాంస్య విగ్రహానికి పూలమాలలుసి నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి కొణిజేటి రోశయ్య

చీరాల: రాజకీయాల్లో మకుటం లేని మహారాజుగా కొణిజేటి రోశయ్య నిలిచారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 92వ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. స్థానిక ఎంజీసీ మార్కెట్ ముందు గల కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీరాల నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఎంజీసీ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. వేముల చంద్రశేఖరరావు, తాతా కుమారస్వామి, చిన్ని లీలాధరరావు తదితరులు పాల్గొన్నారు.

రంగా అందరివాడు



పర్చూరు: రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అభిమానులు

పర్చూరు(చినగంజాం): వంగవీటి రంగా జయంతి వేడుకలను పర్చూరులో అభిమానులు ఘనంగా నిర్వహించారు. బొమ్మల సెంటర్ వద్ద ఉన్న రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగా అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. అనంతరం అందరికీ స్వీట్లు పంచి పెట్టారు. కఠారి సురేంద్ర,కోట హరిప్రసాద్,ఒగ్గిశెట్టి నరసింహరావు, రంగిశెట్టి ఆంజనేయులు, రామాంజనేయులు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

చీరాల: మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా జయంతి పురస్కరించుకుని కొత్తపేటలోని కాపు సేవా సంఘం నాయకులు లక్కాకుల నాగేశ్వరరావు కార్యాలయంలో వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చినగంజాం: కాపు నాయకుడు వంగవీటి మోహన రంగా జయంతిని శుక్రవారం సోపిరాల రంగా సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. జయంతిని పురస్కరించుకొని టీఎస్సార్ ఆంజనేయులు ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమంచి వెంకట సుబ్బారావు, టి. సీతారామయ్య, వి. రామసుబ్బారావు, టీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.